ఫ్లాప్ షోగా 'ప్రజాగళం'

- మధ్యాహ్నం 3.30 గంటలకు హెలిప్యాడ్‌లో దిగినా సభా వేదిక వద్దకు రాని అధినేతలు
- జనం లేకపోవడంతో గంటకుపైగా నిరీక్షణ
- రాజంపేటలో అభ్యర్థి ఫొటో లేకుండా కూటమి ఫ్లెక్సీలు
- డబ్బులు, మద్యం ఇచ్చినా అంతంత మాత్రంగానే జనం



రాజంపేట సభలో గురువారం మధ్యాహ్న ప్రాంతంలో జనాలు లేని దృశ్యం

సాక్షి రాయచోటి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కూటమి నిర్వహించిన ప్రజాగళం బహిరంగసభ తుస్సుమంది. జనాలు రాక.. నేతలు ఎదురు చూడలేక.. ఎటూ పాలుపోని పరిస్థితి. పైగా స్వంత నియోజకవర్గం కాకుండా వలస నేతను తెచ్చుకున్నారన్న కోపం, దీనికితోడు ఆది నుంచి పార్టీని నమ్ముకున్న చెంగల్రాయుడుకు అధిష్టానం మొండిచేయి చూపడంతో ప్రజాగళం సభకు జనాలు కరువయ్యారు. డబ్బులు, మద్యం విచ్చలవిడిగా పంచినా.. ఏమి చేసినా ప్రజాబలం లేకుండా సభ కాస్త నిర్వీర్యమైంది. దీంతో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అదినేత పవన్ కల్యాణ్‌లు నిర్ణీత సమయం మేరకు హెలిప్యాడ్‌కు చేరుకున్నా వేదిక వద్దకు రాలేని పరిస్థితి నెలకొంది. మరోపక్క రాజంపేట లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి కారులోనే రాజంపేట బైపాస్‌లో నిరీక్షిస్తూ ఉండిపోయారు.

విపత్కర పరిస్థితులతో నేతల్లో ఆందోళన

రాజంపేటలో ప్రతిష్టాత్మకంగా ప్రజాగళం సభ నిర్వహించాలని కూటమి పార్టీల నేతలు భావించినా జనం కనిపించకపోవడంతో ఎక్కడికక్కడ నిమ్మకుండిపోయారు. గురువారం మధ్యాహ్నం కరెక్టుగా 3.30 గంటలకు సభ ప్రారంభం కావాల్సి ఉండగా, రాజంపేటలోని పాత బస్టాండులో పట్టుమని 200 – 300 మంది కూడా లేకపోవడంతో అందరూ ఎక్కడికక్కడ గప్‌చుప్‌గా ఉండిపోయారు. చివరకు సాయంత్రం 4.40 నుంచి 5.00 గంటల ప్రాంతంలో సభను ప్రారంభించి ఏదో గంటపాటు అలా ఉసూరుమనిపించారు.

రాజంపేటలో కనిపించని బత్యాల

తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి ఎంతో ఆర్భాటంగా రాజంపేట పాత బస్టాండులో నిర్వహించిన ప్రజాగళం సభకు బత్యాల చెంగల్రాయుడు దూరంగా ఉన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి పార్టీని నమ్ముకుని ఇన్‌ఛార్జిగా ఎన్నో ఉద్యమాలు చేసినా బత్యాలకు చంద్రబాబు సీటు విషయంలో ఎగనామం పెట్టారు. రాజంపేటలో లోకల్ కాకుండా రాయచోటి నుంచి నాయకుడిని దిగుమతి చేసుకుని సీటు ఇవ్వడంపై బత్యాల బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడుతోపాటు ఆయన వర్గీయులు రాజంపేటలో కనిపించలేదు. దీంతో మళ్లీ టీడీపీలో ఆందోళన మొదలైంది. అలానే రాజంపేటలో ప్రజాగళంను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తరుణంలో అక్కడక్కడా కూటమి బ్యానర్లు వెలిశాయి. అందులో ఎక్కడా టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ఫొటో కనిపించలేదు. దీంతో రాజంపేట టీడీపీలో ఉన్న అంతర్గత విబేధాలు మరోసారి బహిర్గతమయ్యాయి.

క్లుప్తంగా

శివాలయానికి శఠగోపం బహూకరణ



వెండి శఠగోపం, గంటను అందజేస్తున్న దృశ్యం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రమైన పెనగలూరు పురాతన కాలం నాటి శివాలయానికి వెండి శఠగోపం బహూకరించినట్లు ఆలయ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య తెలిపారు. ఎస్ఆర్ పురం గ్రామానికి చెందిన బి.వెంగల్ రెడ్డి, జయమ్మ దంపతుల కుమారుడు వెంకటరమణారెడ్డి, సుభాషిణమ్మలు ఈ శటగోపాన్ని సమర్పించారు. అలాగే వేణుగోపాలస్వామికి వెండి గంట కూడా బహూకరించినట్లు ఆయన తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



సిద్దవటం గ్రంథాలయంలో విద్యార్థులు పుస్తక పఠనం చేస్తున్న దృశ్యం

సిద్దవటం : విద్యార్థులు పుస్తకాలను చదవితే పూర్తిగా విజ్ఞానం సొంతమవుతుందని తమ పాఠశాల ఉపాధ్యాయులు అన్నారని విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలకు గురువారం నుంచి వేసవి సెలవులు ఇవ్వడంతో మండల కేంద్రమైన సిద్దవటంలోని ఎగువపేటకు చెందిన విద్యార్థులు స్వచ్ఛందంగా వచ్చి ఎండలకు బయట తిరుగకుండా ఉండాలనే ఉద్దేశంతో తాము గ్రంథాలయానికి వచ్చినట్లు విద్యార్థులు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం



హరిప్రసాద్

రాజంపేట రూరల్ : సమాజ సేవా సమితి జిల్లా కార్యదర్శిగా తనను రాష్ట్ర అధ్యక్షులు వాండ్రాసి పెంచలయ్య నియమించినట్లు పట్టణానికి చెందిన లావునూరి హరిప్రసాద్ గురువారం తెలియజేశారు. సమాజంలోని పేదలకు, అనాథలకు తనవంతు సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలియజేశారు. సేవా కార్యక్రమాలు చేయటంలో చొరవ చూపుతానని తెలియజేశారు.

సేవా తత్పరతను అలవరుచుకోవాలి



ఫ్రిజ్‌ను ప్రారంభిస్తున్న సీఐ రవీంద్రబాబు

రాజంపేట రూరల్ : ప్రతి ఒక్కరూ సేవా తత్పరతను అలవర్చుకోవాలని రూరల్ సీఐ ఎస్.రవీంద్రనాథ్ కోరారు. పట్టణంలోని అమ్మవారిశాల సమీపంలో ఉన్న శ్రీఆంజనేయ స్వామి దేవస్థానంకు గతంలో కృష్ణ చైతన్య అన్నదాన ట్రస్ట్ (కువైట్) ఆధ్వర్యంలో వితరణ చేసిన కూల్ ఫ్రిజ్ పాడవటంతో తిరిగి వారు రూ. 60వేలతో ఫ్రిజ్‌ను వితరణ చేశారు. ఈ కూల్ వాటర్ ఫ్రిజ్, ఆర్‌ఓను ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ రవీంద్రనాథ్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో కృష్ణ చైతన్య అన్నదాన ట్రస్ట్ (కువైట్) అధ్యక్షులు ఇండ్లూరు వజ్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి కొన్నిపాటి రమణయ్య, నందలూరు రవీంద్రరెడ్డి, చంద్ర, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబుకు ఓటేస్తే జీవితాలు నాశనమే

- ప్రజారంజక పాలనకు ఫ్యాన్‌కు ఓటు వేద్దాం
- ముమ్మర ఎన్నికల ప్రచారంలో రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి



ఇంటింటి ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్నాథరెడ్డి

వీరబల్లె (రాయచోటి టౌన్) : ప్రజారంజక పాలన అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత ఓటర్లపై ఎంతైనా ఉందని రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి ప్రజలకు సూచించారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా గురువారం గడికోట గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల వద్దకు వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఒకటి ఎంపీ అభ్యర్థి పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థినైన తనకు ఓటు వేసి, వేయించి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ క్రమంలో గడికోట కస్పా, వేల్పుల మిట్ట హరిజనవాడ, ఎస్టీ కాలనీ, రెడ్డివారిపల్లె, రెడ్డివారిపల్లె హరిజనవాడ, పీరయ్యగారిపల్లె, రాచపల్లె, పెద్దూరు కస్పా, చిన్నాగిరెడ్డిగారిపల్లె, హరిజనవాడ, యడపల్లె, కృష్ణయ్యగారిపల్లెలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు నాయుడు వస్తే మాత్రం సంక్షేమ పథకాలు పోతాయని తెలియజేశారు. దీంతో పేద ప్రజల జీవితాలు నాశనం అవుతాయని చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్విరామంగా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు గాలివీటి మదన్‌రెడ్డి, గాలివీటి వీరనాగిరెడ్డి, వివేకానంద రెడ్డి, రాజీవ్‌రెడ్డి, గంగిరెడ్డి, కుళ్లాయిరెడ్డి, వీఆర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆకేపాటి వెంట నడిచారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో కొండూరు అజయ్‌రెడ్డి, బాబుల్‌రెడ్డిలు

ఓబులవారిపల్లె : ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. పుల్లంపేట మండలం గారాలమడుగు పంచాయతీ సీతారాంపేటకు చెందిన టీడీపీ నాయకులు వెంకటసుబ్బయ్య తన వర్గంతో గురువారం రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షులు పంజం సుకుమార్ రెడ్డి, పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డిల సమక్షంలో వారికి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పుల్లంపేట ఎంపీపీ మాట్లాడుతూ బీసీ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందించడంతో అనేక మంది వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని చెప్పారు. జగనన్న బీసీల పక్షపాతి అని, బీసీల అభివృద్ధికి రిజర్వేషన్లు కల్పించి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. మండలంలో ఇప్పటి వరకు రెండు ఎంపీటీసీ స్థానాలు, రెండు సర్పంచ్ స్థానాలు బీసీలకు కేటాయించామని తెలియజేశారు. వైఎస్సార్సీపీలో బీసీ నాయకుడు వెంకటసుబ్బయ్యకు రాజకీయంగా ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మడగలం శ్రీనివాసులు, వైఎస్సార్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర



భక్తుల పూజలందుకున్న గంగమ్మ

నందలూరు (రాజంపేట) : మండల కేంద్రమైన నందలూరు గ్రామ పంచాయతీలో ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిగే గంగమ్మ జాతరను నందలూరు గ్రామస్తుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి నుంచే గంగమ్మను పురవీధుల గుండా ఊరేగిస్తూ తెల్లవారుజామున అమ్మవారిని కొలువుదీర్చారు. ఈ సందర్భంగా భక్తులు దారిపొడవునా కాయా కర్పూరాలు అమ్మవారికి సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. గురువారం రాత్రి చాందినీ బండ్లతో అమ్మవారిని ఊరేగిస్తూ నేడు శుక్రవారం తెల్లవారుజామున చెయ్యేరులో నిమజ్జనాన్ని వైభవంగా నిర్వహించారు. గురువారం తెల్లవారుజాము నుంచే మహిళలు బోనాలతో పొంగళ్లను అమ్మవారికి సమర్పించారు. జాతరను పురస్కరించుకొని రాజంపేట టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, మంచినీటిని అందజేశారు. నందలూరు బస్టాండ్ సమీపంలో గురువారం అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రంను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సుభాన్, అధ్యక్షులు కె.రాము, సెక్రటరీ ఎస్.అబ్దుల్ గఫూర్, ట్రెజరర్ ఎ.హరినాథ్, ప్రతినిధులు అలీ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

సిద్దవటం : మండలంలోని మాధవరం – 1 గ్రామ పంచాయతీ బంగారుపేట సమీపంలో వెలసిన శ్రీ గంగాభవాని అమ్మవారి 32వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫ్యామిలీ ట్రస్టు అధ్యక్షుడు మాడా పెద్దసుబ్బరాయుడు, రామక్రిష్ణయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ శుక్రవారం అమ్మవారికి గణపతి పూజ, స్వస్తిహోవాచనం, మాతృకపూజ వంటి పూజా కార్యక్రమాలు జరుపనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన లక్ష కుంకుమార్చన పూజలు, పూజలో పాల్గొన్న స్త్రీలకు అమ్మవారి ప్రసాదాలు, మంగళప్రదమైన గాజులు, పసుపు, కుంకుమలు అందజేస్తామన్నారు. 27 ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు ఉంటాయన్నారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం, 28వ తేదీ ఆదివారం అమ్మవారికి బోనాలు, మొక్కుబడుల చెల్లింపు కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సామాన్యులను ఇబ్బంది పెట్టడం పైశాచికత్వం



పంజం సుకుమార్‌రెడ్డి

ఓబులవారిపల్లె : రైల్వే కోడూరు పట్టణంలో సాయంత్రం 4 గంటల నుంచి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, కిరణ్‌కుమార్ రెడ్డిల కోసం ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం పైశాచికత్వమని జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు పంజం సుకుమార్‌రెడ్డి తెలిపారు. కూటమి పార్టీల సభ వల్ల ప్రజలు ఎదుర్కొన్న గురువారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దఎత్తున వేల కిలోమీటర్లు బస్సు యాత్ర చేపట్టారని, ఎక్కడా ప్రజలను ఇబ్బంది పెట్టకుండా యాత్రను కొనసాగిస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లు కోసం రైల్వేకోడూరులోని ప్రధాన రహదారిని మూసివేయడంతో గంటల తరబడి ప్రయాణీకులు, రోగులు ఇబ్బందులు పడ్డారన్నారు. అత్యవసర వాహనాలు కూడా వెళ్లేందుకు వీలు లేకుండా ఈ విధంగా ప్రవర్తించడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇటువంటి వారు ప్రజలకు ఏమి న్యాయం చేయగలుగుతారన్నారు.

శవ రాజకీయాలు చేయటం బాబుకు వెన్నతో పెట్టిన విద్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రాజంపేట రూరల్ : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి శవ రాజకీయాలు చేయటం వెన్నతో పెట్టిన విద్య అని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఇ.సుబ్బారెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ టి.వేణుగోపాల్‌రెడ్డిలు ఆరోపించారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో గురువారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించి మాజీ సీఎం చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. వారు మాట్లడుతూ సీఎంలుగా పని చేసిన చంద్రబాబునాయుడు, కిరణ్‌కుమార్‌రెడ్డిలు తమ స్థాయిని మరిచి వైఎస్సార్‌సీపీపై ఆరోపణలు చేయటం సిగ్గుచేటన్నారు. చేనేత కుటుంబం ఆత్మహత్యపై టీడీపీ పార్టీ వారు, వారి అనుకూల మీడియా చేసిన ఆరోపణలు అప్పుడే తాము ఖండించామన్నారు. చేనేత కుటుంబం వారిది ఆత్మహత్య కాదు హత్య అని డీఎస్పీ స్థాయి అధికారి ప్రెస్ మీట్ పెట్టి వెల్లడించింది గుర్తు లేదా అని ప్రశ్నించారు. ఆ కుటుంబంలో విషాదానికి కారణం అయ్యింది గత ప్రభుత్వ నిర్వాకం వల్లేనని వివరించారు. మీరు చేసిన తప్పుని మాపై మోపడం ఏమిటని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ పాలనలో చేనేత కుటుంబానికి హాని జరిగిందని నిరూపిస్తే కోటి రూపాయలు ఇస్తామని సవాల్ విసిరారు. అన్నమయ్య డ్యాం వరద ఉధృతికి తెగిపోతే అది ఇసుక కోసం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి వలన తెగిపోయిందని ఆరోపించిన నీవు నేడు ఆకేపాటి వలన తెగిపోయిందటున్నావు అంటే నీ మాట తీరు ఊసరవెల్లిని మించిపోతుందని ప్రజలు గ్రహిస్తున్నారని గుర్తుంచుకోవాలని తెలియజేశారు. జనం లేక బహిరంగ సభ పెట్టుకోలేని నీవు వైఎస్సార్‌సీపీపై నిందలు వేయటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాపినేని విశ్వనాథరెడ్డి, దొడ్డిపల్లి బాస్కర్‌రాజు, వడ్డే రమణ, జీవీ సుబ్బరాజు, దాసరి పెంచలయ్య పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

రాజంపేట : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ నోడల్ అధికారి చంద్రనాయక్ హెచ్చరించారు. గురువారం రాజంపేట పట్టణంలోని పలు ప్రభుత్వ మద్యం షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలన్నారు. మద్యం నియంత్రణ కోసం జిల్లాలోని మద్యం డిపోతోపాటు ప్రభుత్వ మద్యం దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామన్నారు. సంబంధిత రిజష్టరుల ద్వారా స్టాకులను నిశితంగా పరిశీలించారు. అలాగే ముందురోజు అమ్మగా వచ్చిన నగదు సకాలంలో బ్యాంకులలో జమ చేస్తున్నారా లేదా అనేది రికార్డులను చూసి తెలుసుకున్నారు. ఆయన వెంట డీటీ జయసింహ, ఎక్సైజ్ ఎస్ఐ రామకృష్ణశాస్త్రి, ఎస్ఐ గాయత్రి, జీఎస్‌టీ అధికారితోపాటు టీం సభ్యులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం



ప్రచారంలో మహిళలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల

చిట్వేలి : పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించి పేదల హృదయాలలో సుస్థిరస్థానం సంపాదించుకున్నారని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సిద్దారెడ్డిపల్లి పంచాయతీలో నిమ్మలాల్లమ్మ ఎస్టీ కాలనీ, సిద్దారెడ్డిపల్లిలో మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ నాయకులకు గ్రామ ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో అందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి ఫలాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో తిరిగి సంక్షేమం, అభివృద్ధి పాలన కావాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించుకోవాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నకు కానుకగా అందించి మళ్లీ రెండోసారి ముఖ్యమంత్రి అయ్యేందుకు ఆశీర్వదించాలని కొరముట్ల శ్రీనివాసులు ప్రజలను అభ్యర్థించారు. సిద్దారెడ్డిపల్లి పంచాయతీలోని దిగువపట్ల గుండాలయ్య, ఈశ్వరయ్య, కిట్టయ్య, నక్కల సుబ్బరాయుడుతోపాటు 20 కుటుంబాలకు చెందిన 60 మంది సభ్యులకు ఎమ్మెల్యే కొరముట్ల పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎల్‌వీ మోహన్ రెడ్డి, చిట్వేలి ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి, వెంకటధర్మారెడ్డి, రమణారెడ్డి, ఎంపీపీ చంద్ర, మలిశెట్టి వెంకటరమణ, గుంటి వేదవ్యాస్, ఎంపీటీసీ చంద్ర, హజరత్ రెడ్డి, గులాంబాషా, స్థానిక నాయకులు ప్రభాకర్ యాదవ్, సర్పంచ్ సుబ్బరత్నమ్మ, ఉపసర్పంచ్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

చెంగల్‌రెడ్డికి ఘన నివాళి



ఓబులవారిపల్లె: కర్మక్రియలో పాల్గొన్న ఎమ్మెల్యే కొరముట్ల, నాయకులు

ఓబులవారిపల్లె/చిట్వేలి/పుల్లంపేట : ముఖ్యమంత్రి సలహాదారు రక్కసి ధనుంజయరెడ్డి సోదరుడు రక్కాసి చెంగల్ రెడ్డి చిత్రపటానికి రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిలు ఘనంగా నివాళులర్పించారు. గురువారం రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట గ్రామంలో రక్కసి చెంగల్ రెడ్డి కర్మక్రియలు కార్యక్రమాన్ని ధనుంజయరెడ్డి, కుటుంబ సభ్యులు నిర్వహించారు. నియోజకవర్గం వ్యాప్తంగా వేలాది మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై చెంగల్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షులు పంజం సుకుమార్ రెడ్డి, పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డి, మడగలం శ్రీనివాసులు, సుధాకర్ రాజు, ఎంపీటీసీ మహేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య, సర్పంచ్ నారాయణ రెడ్డి, కృష్ణయ్య, సీనియర్ నాయకులు కొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, ఓజీ శ్రీనివాసులు రెడ్డి, మలిశెట్టి వెంకటరమణ, హజరత్ రెడ్డి, ఎస్.హరినాథ్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయంగా సీతారాముల కల్యాణోత్సవాలు



వీరబల్లె మండలం వంగిమళ్ల గ్రామంలో సీతారాములకు పల్లకీ సేవ చేస్తున్న దృశ్యం



రాజంపేట టౌన్ : స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

రాజంపేట టౌన్ : ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన శ్రీరామనవమి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. తొమ్మిదవ రోజైన గురువారం నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో, గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాలతో గ్రామాల్లో ఎటుచూసినా సందడి వాతావరణం కనిపించింది. పలు ప్రాంతాల్లో రాములోరి కల్యాణ మహోత్సవాన్ని ఉదయం నిర్వహించగా మరికొన్ని ప్రాంతాల్లో రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలతో, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై కొలువుదీర్చారు. అనంతరం ఆయా ప్రాంతాల్లోని రామాలయాల ప్రధాన అర్చకులు కల్యాణ క్రతువును కమనీయంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలను అందజేశారు.

వీరబల్లెలో..

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె మండలం వంగిమళ్ల గ్రామంలో వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి వంగిమళ్ల గ్రామంలోని నల్లపర్వతయ్యగారిపల్లెలో రామాలయంలో శ్రీ సీతారాముల స్వాముల వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి పూలతో అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో భోజన సదుపాయం కల్పించారు. అనంతరం అలంకరణలో ఉన్న సీతారాముల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి నల్లపర్వతయ్యగారిపల్లె, లక్ష్మీనగర్, టెంకాయచెట్టుపల్లె, దుగ్గనపల్లెలలో పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎం.జనార్దన్‌రెడ్డి, శ్రీనాథరెడ్డి, మల్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, బాబు రెడ్డి, హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం

పుల్లంపేట : మండల పరిధిలోని కోనెయ్యగారిపల్లె గ్రామంలో వెలసిన కోదండరామస్వామి కల్యాణ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణోత్సవాన్ని జరిపేందుకు డాక్టర్ నాగచంద్రశేఖర్ రెడ్డి, ముని భాగ్యలక్ష్మి, దాతలు సహకరించారు. అనంతరం గల్లా గుండయ్య భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాగ పిచ్చిరెడ్డి, నాగ శైలజ, ఆలయ చైర్మన్ సుధాకర్ రెడ్డి, కమిటీ సభ్యులు నాగశంకర్ రెడ్డి, లీలానందకుమార్ రెడ్డి, పెద్దఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కల్యాణ వేడుకకు హాజరైన కొరముట్ల

ఓబులవారిపల్లె : మండలంలోని పాపిరెడ్డిపల్లె గ్రామంలో గురువారం శ్రీ సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి పూజారులు వేదమంత్రాలతో శ్రీ సీతారామ కల్యాణాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సీతారామ కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు పామూరు దీపక్ రెడ్డి, నారాయణ రెడ్డి, పామూరు రామిరెడ్డి, పాపిరెడ్డిపల్లె గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీ ఇండ్లూరు గ్రామంలో గురువారం రాత్రి సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామస్తుల సహకారంతో గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య, ఆలయ పూజారి రామలింగయ్య స్వాములు కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి అన్నదాన కార్యక్రమం, గ్రామోత్సవం నిర్వహించారు.

వేడుకగా 9వ రోజు శ్రీరామనవమి ఉత్సవాలు



రాజంపేట రూరల్: భువనగిరిపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రాజంపేట రూరల్ : శ్రీరామ నవమి వేడుకలు గురువారం 9వ రోజుకు చేరుకున్నాయి. 9వ రోజును పురస్కరించుకొని గ్రామాలలోని శ్రీ కోదండరామాలయాల అధిక సంఖ్యలో సీతారాముల కల్యాణంను కనుల పండువగా నిర్వహించారు. ఆలయాల వద్ద భజన కార్యక్రమాలు జరిగాయి. వేడుకల అనంతరం శ్రీరామచంద్రమూర్తికి అత్యంత ప్రీతి కరమైన శనగలు, పానకం, వడపప్పు, కొబ్బెరలను వితరణ చేసి భక్తిని చాటుకుంటున్నారు.

ముగిసిన కోదండరాముని బ్రహ్మోత్సవం




ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

ఒంటిమిట్ట శ్రీ కోదండ రాముని బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు జరిగిన ఈ బ్రహ్మోత్సవాలలో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవంలో అశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రలయ్యారు. టీటీడీ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పటిష్ట చర్యలు చేపట్టింది. పోలీసులు బందోబస్తు కల్పించారు. తొమ్మిదవ రోజు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, చక్రస్నానం శోభాయమానంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

– ఒంటిమిట్ట



ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు





రాచరాయుడి వైభవం..
ప్రాజెక్టుల ప్రాభవం

- వ్యవసాయమే జీవనాధారం
- జాతర్లకు ప్రసిద్ధి రాయచోటి
- అన్నమయ్య జిల్లా ఏర్పాటుతో అభివృద్ధి దిశగా అడుగులు
- రాచరాయుడి పేరుతో వెలసి రాయచోటిగా రూపాంతరం

రాయచోటి: నిత్యం కరువు కాటకాలకు నిలయంగా మారిన రాయచోటి నియోజకవర్గ పరిధిలో వ్యవసాయమే ఆధారంగా ప్రజలు జీవనం సాగిస్తున్నారు. వర్షాధారంగా వేరుశనగను, చెరువులు, కుంటల కింద వరిని ప్రధాన పంటగా రైతులు సాగు చేస్తుంటారు. తగినంత సాగునీరు లేకపోవడంతో స్థానికులు అధికంగా కుటుంబ పోషణ కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తుంటారు. దశాబ్దంన్నర క్రితం వరకు రాయచోటిలో తాగేందుకు గుక్కెడు నీరు దొరకాలంటే అష్టకష్టాలు పడాల్సి వచ్చేది. నాటి రోజుల్లోనే బిందె తాగునీటికి రూపాయి నుంచి 10 రూపాయల వరకు వ్యయం చేయాల్సిన పరిస్థితులు ఉండేవి. దివంగత నేత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత శరవేగంగా గాలివీడు మండల కేంద్రం సమీపంలోని పాపాఘ్ని నదిపై వెలిగల్లు ప్రాజెక్టును పూర్తి చేయించారు. అక్కడి నుంచి తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయించారు. అలాగే హంద్రీ–నీవాలో భాగంగా చిన్నమండెం సమీపంలో శ్రీనివాసపురం రిజర్వాయర్, సంబేపల్లె మండల సమీపంలో ఝరికోన ప్రాజెక్టులకు జీవం పోసి తాగునీటి ఇక్కట్ల నుంచి గట్టెక్కించారు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల ఎకరాల భూమిలో ఉద్యాన పంటలు, వరి, వేరుశనగ, టమాట ఇతర కూరగాయల పంటల సాగుకు అవకాశం కల్పించారు.

రాచరాయుడు పేరుతోనే...

రాయచోటిలోని వీరభద్ర ఆలయం వీరశైవుల పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. స్వయంగా వీరభద్రుడే విగ్రహ మూర్తిగా ఇక్కడ కొలువైనందున రాయచోటి వీరభద్ర ఆలయాన్ని దక్షిణ భారత దేశ వీరభద్ర ఆలయానికి మూలవిరాట్‌గా పేర్కొంటుంటారు. వీరభద్రునికి రాచరాయుడుగా పురాతన కాలం నుంచి పిలుస్తున్నారు. అది కాలక్రమంలో రాచరాయుడు, రాచవీడుగా మారి నేడు రాయచోటిగా రూపాంతరం చెందినట్లు చరిత్రకారులు చెబుతుంటారు.

» సామ్రాజ్య విస్తరణలో భాగంగా యుద్ధాలు చేసి అలసిపోయిన రాజరాజ చోళుడు మానసిక ప్రశాంతత కోసం దేశాటనకు బయలుదేరి ఇక్కడి మాండవ్య నది తీరానికి చేరుకున్నాడు. కొండలు, గుట్టల నడుమ ప్రవహిస్తున్న మాండవ్య నది ఒడ్డున సాగైన పూల తోటలతో ఈ ప్రాంతం ఆయనను విశేషంగా ఆకర్షించిందని, దీంతో ఆయన ఇక్కడే తన పరివారంతో నిలిచిపోయి భద్రకాళీ సమేత వీరభద్రుని కొలిచి జీర్ణావస్థలో ఉన్న ఆలయాన్ని పునర్ నిర్మించాడని చరిత్ర చెబుతోంది.

» వీరభద్రునికి రాచరాయుడు అనే పేరు కూడా ఉంది. బ్రహ్మోత్సవాల నిర్వహణ అనంతరం మార్చినెలలో 21 నుంచి 24వ తేదీల మధ్యలో ఎన్నో ద్వారాలు దాటుకుని సూర్యకిరణాలు స్వామివారి పాదాలను తాకడం విశేషం.

» వీరభద్రున్ని హిందువులతో పాటు ముస్లింలు దర్శించుకుంటారు. ముస్లింలలోని దేశముఖ్‌కు చెందిన వారు బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారికి పూజా సామగ్రి పంపుతారు. ఆలయ కమిటీ వాటిని స్వీకరించి పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను వారికి పంపడం ఆనవాయితీగా వస్తోంది.

నియోజకవర్గ స్వరూపం...

2004 వరకు రాయచోటి, లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గాలు విడివిడిగా ఉండేవి. రాయచోటి నియోజకవర్గ పరిధిలోని సుండుపల్లి మండలాన్ని లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గ పరిధిలోని వీరబల్లి మండలాన్ని రాజంపేట నియోజకవర్గంలో కలపగా లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గ పరిధిలోని చింతకొమ్మదిన్నెను కమలాపురంలో, చక్రాయపేట మండలాన్ని పులివెందుల నియోజకవర్గంలో కలిపారు. అనంతరం లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గాన్ని రద్దు చేసి లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాలను రాయచోటి నియోజకవర్గంలో విలీనం చేశారు.

రాయచోటి ఎమ్మెల్యేలు

1952 వై.ఆదినారాయణరెడ్డి(స్వతంత్ర)
1955 వై.ఆదినారాయణరెడ్డి(కాంగ్రెస్)
1962 ఆర్.నారాయణరెడ్డి(స్వతంత్ర)
1967 ఎం.కృష్ణారెడ్డి(కాంగ్రెస్)
1972 ఎస్.హబీబుల్లా(కాంగ్రెస్)
1978 ఎస్.పాలకొండ్రాయుడు(జనత)
1983 ఎస్.పాలకొండ్రాయుడు(స్వతంత్ర)
1985 ఎం.నాగిరెడ్డి(కాంగ్రెస్)
1990 ఎం.నాగిరెడ్డి(కాంగ్రెస్)
1992 ఎం.నారాయణరెడ్డి(కాంగ్రెస్)
1994 ఎం.నారాయణరెడ్డి(కాంగ్రెస్)
1999 ఎస్.పాలకొండ్రాయుడు(టీడీపీ)
2004 ఎస్.పాలకొండ్రాయుడు(టీడీపీ)
2009 గడికోట శ్రీకాంత్‌రెడ్డి(కాంగ్రెస్)
2012 గడికోట శ్రీకాంత్‌రెడ్డి(వైఎస్సార్‌సీపీ)
2014 గడికోట శ్రీకాంత్‌రెడ్డి(వైఎస్సార్‌సీపీ)
2019 గడికోట శ్రీకాంత్‌రెడ్డి(వైఎస్సార్‌సీపీ)

వివిధ పథకాల లబ్ధి వివరాలు..

పథకం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
జగనన్న అమ్మ ఒడి	38939	156.85
వైఎస్సార్ చేయూత	17698	92.33
వైఎస్సార్ ఆసరా	37098	85.77
వైఎస్సార్ రైతు భరోసా	43246	21.66
వైఎస్సార్ సున్నా వడ్డీ	21058	63.11
వైఎస్సార్ కాపు నేస్తం	1434	4.70
ఉచిత పంటల బీమా	16120	34.29
జగనన్న వసతి దీవెన	20498	23.83
వైఎస్సార్ నేతన్న నేస్తం	730	4.13
వైఎస్సార్ బీమా	===	===
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	20206	18.31
వైఎస్సార్ వాహన మిత్ర	2347	5.9
కోవిడ్‌లో వైట్ కార్డు దారులకు లబ్ధి	79123	7.91
ఇతర పథకాలు..		
జగనన్న చేదోడు	10758	200.30
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	9010	6.012
వైఎస్సార్ లా నేస్తం	==	==
వైఎస్సార్ కళ్యాణ మస్తు. షాదీతోఫా	76	6.17 (లక్షలు)
నాన్ డీబీటీ పథకాల లబ్ధి..		
జగనన్న తోడు	6764	31.42(లక్షలు)
వైఎస్సార్ గోరు ముద్ద	23223	23.07
జగనన్న విద్యా కానుక	23341	16.57
ఇళ్లస్థలాలు (భూ సేకరణ, పరిహారం చెల్లింపు)	11808	118.16

నోట్ : వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, జగనన్న విద్యా దీవెనల పథకాలకు సంబంధించి రూ.కోట్లకు పైగా లబ్ధి చేకూరింది.

- రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గంలో 1.09 లక్షలకు పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కుటుంబాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డీబీటీ పథకాల ద్వారా 934 కోట్లు, నాన్ డీబీటీ పథకాల ద్వారా 355 కోట్లు ఖర్చు చేసింది.
- బీసీల కోసం ఖర్చు చేసిన మొత్తం డీబీటీ ద్వారా 695 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా 272 కోట్ల రూపాయలు.
- ఎస్సీల కోసం ఖర్చు చేసిన మొత్తం డీబీటీ ద్వారా 140 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా 45 కోట్ల రూపాయలు.
- ఎస్టీల కోసం ఖర్చు చేసిన మొత్తం డీబీటీ ద్వారా 34 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా 12 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు.
- మైనార్టీల కోసం ఖర్చు చేసిన మొత్తం డీబీటీ ద్వారా 65 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా 27 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు.

విశేషాలు

✔ రాయచోటి రాయలసీమ ప్రాంతంలో ముఖ్యమైన పట్టణంగా పేరొందింది. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి దిన దినాభివృద్ధి చెందుతోంది. మాండవ్య నది ఈ పట్టణం మధ్యన పోతోంది. రాయచోటి పట్టణంలో పురాతన వీరభద్రాలయం శైవులకు అత్యంత ప్రీతి పాత్రమైంది. శివరాత్రి మాసంలో జరిగే బ్రహ్మోత్సవాలలో రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి లక్షలాదిగా వీరశైవులు, భక్తులు, రాజకీయ నేతలు ఆలయాన్ని సందర్శించుకుంటారు.

✔ రాయచోటి నియోజకవర్గం జాతర్ల(తిరునాళ్ల)కు ప్రసిద్ధి. జనవరిలో సంక్రాంతి మాసం ప్రారంభం నుంచి జూన్ నెల ముగిసే వరకు దేవుళ్లు, దేవతల ఆలయాల వద్ద జరిగే జాతర్లు లక్షలాది మంది కుటుంబాలు, బంధువులు, మిత్రులను కలుపుతుంటాయి.



✔ లక్కిరెడ్డిపల్లె మండలం సమీపంలోని గంగమ్మగుడి చాలా విశిష్టత కలిగినది. ఏటా మార్చి నెలలో శివరాత్రి పండుగ ముగిసిన మూడవ రోజున గంగమ్మ జాతరకు రాయలసీమలోని నలు మూలల నుంచి లక్షలాదిగా భక్తులు వస్తారు. జాతర సందర్భంగా రంగురంగుల చాందినీ బండ్లు, లక్షల కొలది జంతు బలులతో మొక్కుబడులు తీర్చుకుంటారు.

✔ చిన్నమండెం మండలం సమీపంలో మండెం లక్ష్మీ నరసింహస్వామి ఆలయం అతి పురాతనమైనది. ఈ ఆలయాన్ని వాగ్గేయకారుడు అన్నమయ్య సందర్శించి నరసింహరాయుడిపైన కొన్ని గేయాలు కూడా పాడినట్లు చరిత్ర చెబుతోంది.

✔ బ్రిటీష్ కాలంలోనే రాయచోటి రెవెన్యూ డివిజన్‌గా ఉండేది. ప్రస్తుత బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఒకప్పటి రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఉండేది. రాష్ట్రాల విభజన, ప్రాంతాల ఏర్పాటులో అది కనుమరుగైంది..

✔ బ్రిటీష్ కాలంలోనే రాయచోటిలో విద్యాకేంద్రానికి పెద్దపీట వేశారు. టీచర్ ట్రైనింగ్ కేంద్రాన్ని 1900 సంవత్సరంలోనే ఏర్పాటు చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. వారు నిర్మించిన భవనం నేటికి సభాభవనంగా పనిచేస్తుండడం విశేషం.

✔ రాయచోటి పట్టణంలో బ్రిటీష్ కాలం నాటి పురాతన ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్) ఉంది. ఇంజినీరింగ్ కళాశాల, ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి.

జిల్లా ఏర్పాటుతో..

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కృషితో అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని ప్రకటించారు. జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటి నుంచి వేలాది కోట్ల రూపాయల నిధులతో ప్రభుత్వం చకచకా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఒక ప్రణాళికాబద్ధంగా నియోజకవర్గం అభివృద్ధివైపు అడుగులు వేస్తుండడంతో అనేకమంది బిల్డర్లు, వ్యాపారులు, పరిశ్రమల స్థాపనకు మొగ్గు చూపుతుండడం విశేషం.

ఓటర్ల వివరాలు



నియోజవర్గంలో ప్రస్తుత ఓటర్లు: 2,44,814
పురుషులు: 1,21,082
స్త్రీలు: 1,23,705
ఇతరులు: 27

నియోజకవర్గ సమాచారం

సచివాలయాలు : 98
రైతు భరోసా కేంద్రాలు : 73
విలేజ్ క్లినిక్‌లు: 60
వెటర్నరీ ఆసుపత్రులు: 17
ఆర్బీకేల్లో వెటర్నరీ కేంద్రాలు : 74
ఎంఎస్‌ఎంఈలు: 02



అట్టహాసంగా చింతల నామినేషన్


ఊరేగింపుగా వెళుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అట్టహాసంగా నామినేషన్ వేశారు. పీలేరు పట్టణ రహదారులు జనంతో కిక్కిరిసిపోయాయి. ప్రజలు వేలాదిగా తరలి రావడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతన సమరోత్సాహాన్ని నింపింది. పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, కలికిరి, కేవీపల్లె, కలకడ, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల నుంచి వైఎస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా తరలివచ్చారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం నుంచి ఎస్వీ డీలక్స్ రోడ్డు, ఎల్‌బీఎస్ రోడ్డు గుండా పంచాయతీ మిట్ట, మీదుగా పాతబస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం ఆర్వో కార్యాలయంలో తహసీల్దార్ మహబూబ్‌బాషాకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే తనయుడు చింతల సాయికృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, నల్లారి తిమ్మారెడ్డి, జమీర్‌అలిఖా న్ మాజీ ఎమ్మెల్యే జీ.వి.శ్రీనాథరెడ్డి, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్‌అహమ్మద్, ఆఘామొహీద్దీన్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులురెడ్డి, జీ.వి.రాకేష్‌రెడ్డి, ఎంపీపీ సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి.రత్నశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, షఫీ, హుమయూన్, హబీబ్‌బాషా, చైతన్యరెడ్డి, చక్రధర్, లోకనాథరెడ్డి, మహితా ఆనంద్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రం మరింత అభివృద్ధి


ప్రచారంలో పాల్గొన్న ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, తదితరులు

లక్కిరెడ్డిపల్లి : రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు సుదీప్‌కుమార్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యలు తెలిపారు. మండలంలోని పాలెంగొల్లపల్లి, చిన్నపోతులపల్లి, మామిడిరెడ్డిగారిపల్లి, ఎస్సీ కాలనీ, ఎగువపల్లె, బురుజుపల్లెలలో వారు ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి రాయచోటి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గడికోట శ్రీకాంత్‌రెడ్డిని, రాజంపేట వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ శంకర్ నాయుడు, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కాలాడి ప్రభాకర్‌రెడ్డి, సింగల్ విండో ప్రెసిడెంట్‌లు ఎస్.ఎర్రంరెడ్డి, సిద్ధక రామచంద్రారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పోలిరెడ్డి సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ, జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు సిద్ధక నాగిరెడ్డి, కేశవయ్య, జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు రాజేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు చిరునామా సీఎం జగన్


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు

చిన్నమండెం : సంక్షేమ పాలనకు చిరునామా సీఎం జగన్ అని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దిగువగొట్టివీడు, వండాడి గ్రామాల్లో ఆయన జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దిగువగొట్టివీడులోని జంగంపల్లె, దళితవాడ, ముండ్లవారిపల్లె, అబ్బిక్కగారిపల్లె, గుట్టకింద కురవపల్లె, రామాపురం, దిన్నెమీదపల్లె, ఎగువ బలిజపల్లె, దిగువ బలిజపల్లె, దిగువగొట్టివీడు కస్బా, దళితవాడ, కమ్మపల్లెలలోనూ, వండాడి గ్రామంలోని యర్రగట్లవాండ్లపల్లె, వండాడి, మారగానిపల్లె, తొట్టికాడ కురవపల్లె, కాయలవాండ్లపల్లె దళితవాడ, ఉప్పరపల్లె, తూర్పుపల్లె, గాండ్లపల్లె దళితవాడ, సాయినగర్, కదిరివాండ్లపల్లెలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజలకు మరింత సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందాలంటే మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌ను చేయాలని వారు ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నేతలు గోవర్ధన్‌రెడ్డి, ముసల్‌రెడ్డి, వెంకటరమణ, రంగారెడ్డి, బాబురెడ్డి, భూషణ్‌రెడ్డి, నరసయ్యస్వామి, ఏజాస్‌ఆలీఖాన్, చుక్కా అంజనప్ప, రమణ, ప్రతాప్‌రెడ్డి, రామాంజులురెడ్డి, సాదిక్, వెంకట్రామిరెడ్డి, యహియాఖాన్, జహీర్‌ఆలీఖాన్, జావీద్, సజాద్, సుగతుళ్ల, నాగేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి


రాయుడు కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సతీమణి శివలలిత

రాయచోటి అర్బన్ : ఫ్యాను గుర్తుకు ఓట్లువేసి వైఎస్‌ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డిలను గెలిపించాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సతీమణి శివలలిత ఓటర్లను అభ్యర్థించారు. గురువారం పట్టణపరిధిలోని రాయుడుకాలనీ, కొత్తపల్లె, కురవపల్లె, ఎగువ అబ్బావరం, దళితవాడలలో ఆమె మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైఎస్‌ఆర్‌సీపీ నేత ఆనందరెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలతో కలసి ప్రచారం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాయచోటిని అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఎంపికచేసేందుకు శ్రీకాంత్‌రెడ్డి, మిథున్‌రెడ్డిలు ఎంతో కృషిచేశారన్నారు. ఆర్‌టీసీ బస్టాండు విస్తరణ, స్టేడియం నిర్మాణం, 100 పడకల ఆసుపత్రి భవనాల నిర్మాణం, రోడ్ల విస్తరణ, అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వసతి ఏర్పాటు తదితరాలు చేపట్టారన్నారు. రాయచోటిలో మరోమారు అభివృద్ధి పథంలో పరుగులు తీయాలంటే ఫ్యానుగుర్తుకు ఓటువేసి గెలిపించాలంటూ కోరారు. ప్రచారంలో నేతలు మహమ్మద్‌ఖాన్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తబ్రేజ్‌ఖాన్, ఫయాజ్ అహమ్మద్, రియాజ్ అహమ్మద్, జానం రవీంద్రయాదవ్, జానం రాధ, సుగవాసి శ్యామ్‌కుమార్, బుజ్జిబాబు, కిషోర్, మోక్షిత్, పెద్దఎత్తున పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుద్దమళ్ల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల గ్రామం దూదేకులపల్లెలో లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాయచోటిని జిల్లా కేంద్రంగా తీర్చదిద్దటంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో గడికోట సందీప్‌రెడ్డి, ఎంపీపీ గడికోట జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గడికోట ప్రభాకర్‌రెడ్డి, జడ్పీటీసీ రమణ, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డ్ చైర్మన్ విశ్వనాథరెడ్డి, సుద్దమళ్ల సర్పంచ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూషణ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ సుబ్బారెడ్డి, రాయచోటి నియోజకవర్గ యూత్ కన్వీనర్ పవన్‌కుమార్‌రెడ్డి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

స్వార్థ రాజకీయపరులు అవసరమా..!


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి

కలికిరి : నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో పదవులు అనుభవించి కరోనా కష్టకాలంలో కనీసం ప్రజలను పట్టించుకోకుండా పక్కరాష్ట్రానికే పరిమితమైన నల్లారి సోదరుల్లాంటి రాజకీయస్వార్థపరులు అవసరమా అని ప్రజలు ఒకసారి ఆలోచించాలని ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. కలికిరిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని, పీలేరు నియోజవర్గంతో పాటు మదనపల్లి, తంబళ్ళపల్లి, పుంగనూరు నియోజకవర్గాలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి వాటర్ గ్రిడ్‌నులకు టెండర్లు పూర్తయ్యాయన్నారు. వచ్చే రెండేళ్ళలో తాగునీటికి బోర్లపై ఆధారపడకుండా నియోజకవర్గానికి పైపులైను ద్వారా నీరివ్వడం జరుగుతుందన్నారు. ఇక్కడ ప్రజల చిరకాల స్వప్నం హంద్రీ–నీవా పూర్తి చేసి చెరువులకు నీరిచ్చే బృహత్తర కార్యక్రమం పూర్తి చేయనున్నట్లు వారు తెలిపారు. పదేళ్ళ తరువాత బీజేపీ కండువాతో వచ్చిన నాయకుడు కిరణ్, టీడీపీ అభ్యర్థి కిశోర్ ఎన్నికల తరువాత మళ్లీ పక్క రాష్ట్రానికి తిరుగుటపా కడతారని, ప్రజా సమస్యలు వారికి పట్టవని విమర్శించారు. అటువంటి వారికి ఓటర్లు తగిన విధంగా బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉన్న తమను మరోసారి వైస్సార్‌సీపీ ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, రాహుల్ చక్రవర్తిరెడ్డి, సీకాం సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మలేరియా అంతానికి కృషి చేద్దాం

పీలేరు : మలేరియా వ్యాధి అంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం రేగళ్లు, తలపుల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో పీలేరులో మలేరియా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల కాటు వల్లే మలేరియా వస్తుందని, దోమలు వృద్ధి చెందకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్యం పాటించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

మలేరియా నివారణకు పకడ్బందీ చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య

రాయచోటి అర్బన్ : జిల్లాలో మలేరియా నివారణకు పకడ్బందీ చర్యలను చేపడుతున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య తెలిపారు. ప్రపంచ మలేరియా వ్యాధి నివారణ దినోత్సవంను పురస్కరించుకుని గురువారం ఆయన కార్యాలయంలో అదనపు జిల్లా వైద్యశాఖ అధికారిణి శైలజ, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, వివిధ విభాగాల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రతియేటా ఏప్రిల్ 25న నిర్వహించే మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీలలో మలేరియా వ్యాధి నివారణపై అవగాహన సమావేశాలు, ర్యాలీలు చేపట్టామన్నారు. జిల్లా మలేరియా నివారణ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ మలేరియా నివారణలో భాగంగా ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ దోమకాటుకు గురవకుండా దోమతెరలను వినియోగించాలన్నారు. దోమల నివారణకు డీడీటీ స్ప్రేతో పాటు నీటినిల్వలు లేకుండా తమ సిబ్బంది చూస్తున్నారన్నారు. జ్వరంతో బాధపడుతున్న వారి రక్త నమూనాలను సేకరించి వారికి ఉచితవైద్యంతో పాటు మందులను కూడా అందచేస్తామన్నారు. కాలువలు, నీటినిల్వలలో దోమల లార్వా నివారణకు 3 లక్షల గంబూషియా చేపలను సిద్ధం చేశామన్నారు. ప్రజలు మలేరియా నివారణకు ప్రజలు వైద్యసిబ్బందికి సహకరించాలంటూ కోరారు. సమావేశంలో జిల్లా ప్రోగ్రాం అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, వైద్యులు వసీమ్ అక్రమ్, లతీఫ్, బిందు, సబ్‌యూనిట్ అధికారులు ప్రసాద్‌యాదవ్, జయరామయ్య, జిల్లా అధికారులు శ్రీనివాసులురెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బలరామరాజు, రామకృష్ణ, శివారెడ్డి, యూపీహెచ్‌సీల సూపర్‌వైజర్‌లు నూర్జహాన్, ఫర్హానా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

పీలేరు రూరల్ : విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ వైస్ చాన్సెలర్ ఆచార్య శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 45వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానం 2020ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేసిందని, దీని ద్వారా విద్యార్థినీ, విద్యార్థులకు అపారమైన విద్యా, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, తదితరులు పాల్గొన్నారు.